క్లుప్తంగా

సుడా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్: స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.జ్యోతికి పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఎల్.శివానందం పదవీ విరమణ పొందనున్న నేపథ్యాన బదిలీ జరిగింది. కాగా, ఖమ్మం సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న కె.నవీన్‌కుమార్‌కు సుడా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

జీఆర్పీ స్టేషన్‌కు అదనపు సిబ్బంది

ఖమ్మంక్రైం: ఖమ్మం జీఆర్పీ విభాగానికి ఆరుగురు టీఎస్ఎస్పీ(తెలంగాణ స్పెషల్ పార్టీ) సిబ్బందిని కేటాయించారు. జీఆర్పీలో కొంత కాలంగా సిబ్బంది కొరత ఉండడంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు సిబ్బంది ఖమ్మం సీఐ అంజలి, ఎస్ఐ రాణాప్రతాప్‌కు రిపోర్ట్ చేయగా ఐదుగురిని ఖమ్మం స్టేషన్‌కు, ఒకరిని మధిర రైల్వేస్టేషన్‌కు కేటాయించారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కూసుమంచి: లోక మాతాదేవి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పెరికసింగారం గ్రామంలో శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్టీ జిల్లా కోకన్వీనర్ రజనీరెడ్డి, మండల అధ్యక్షురాలు పుణ్యవతి ఆధ్వర్యాన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం అహల్యాబాయి క్యాలెండర్లను ఆవిష్కరించాక.. గ్రామ మాజీ సర్పంచ్ వాసంశెట్టి నర్సింహయ్యను సన్మానించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యాంసుందర్‌నాయక్, నాయకులు యార్లగడ్డ రాఘవ్‌గౌడ్, గుండా ఉపేందర్‌రెడ్డి, నాగమణి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ఫస్టియర్ ప్రవేశాల జాబితా విడుదల

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళ డిగ్రీ గురుకుల కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ ప్రవేశాల తొలిదశ జాబితాను బీసీ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి శుక్రవారం విడుదల చేశారని కాలేజీ ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో ప్రవేశం పొందిన విద్యార్థులు జూన్ 6 సాయంత్రం 4 గంటలలోపు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరై రిపోర్ట్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 70326 32863, 99639 30931 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

పెరిగిన కౌలు వేలం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూముల కౌలు వేలం ఈ ఏడాది పెరిగింది. సర్వే నంబర్ 60, 62లోని 3.29 ఎకరాల భూమికి సంబంధించి శుక్రవారం దేవాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈనేపథ్యాన గతేడాది రూ.30 వేలకు పాడిన పాట ఈ ఏడాది రూ.67 వేలకు పెరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయం ఈఓ కాముని శ్రీకాంత్, దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావు, ఆలయ పూజారి శివయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజగోపాలస్వామి ఆలయ భూముల వేలం..

మండల కేంద్రంలోని రాజగోపాలస్వామి దేవాలయానికి చెందిన నేలకొండపల్లి, బోదులబండలో ఉన్న భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీకాంత్ తెలిపారు. ఆసక్తి గల రైతులు వేలం పాటలో పాల్గొనాలన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని మమతా రోడ్డులో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని వ్యక్తులను ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు చేపట్టిన సాధారణ తనిఖీల్లో వీరిద్దరు పట్టుబడగా, పరీక్షించడంతో గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

యువకుడిని కాపాడిన స్థానికులు

నేలకొండపల్లి: ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానికులు ఆయనను బయటకు తీశారు. మండలంలోని అనంతనగర్‌కు చెందిన శ్రీకాంత్ శుక్రవారం రాత్రి గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న తాగునీటి బావిలో దూకాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై బావిలోకి దూకి తాడు కట్టి ఆయనను బయటకు తీసుకొచ్చారు. అయితే, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కరెంట్ కోతలకు చెక్..

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- సబ్‌స్టేషన్లకు లైన్ల అనుసంధానం
- నిమిషాల వ్యవధిలోనే విద్యుత్ పునరుద్ధరణ
- ముందస్తు మరమ్మతులతో సత్ఫలితాలు
- గత నెల రోజులుగా అధికారుల కుస్తీ..



పాతర్లపాడు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన బ్రేకర్ వద్ద అధికారులు, సిబ్బంది

తిరుమలాయపాలెం: వేసవి కాలం వచ్చిందంటే చాలు ఆకస్మిక గాలిదుమారాలు, పిడుగుపాట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్ పరికరాలు పేలిపోవడం వంటి తరచూ జరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడేవి. రోజుల తరబడి అంధకారంలో ఉంటూ అటు విద్యుత్ అధికారులతో పాటు ప్రజలు కూడా కంటిమీద కునుకు లేకుండా అనేక ఇబ్బందులు పడేవారు. కానీ విద్యుత్ శాఖాధికారుల ముందస్తు ప్రణాళికలతో ప్రస్తుతం నిమిషాల వ్యవధిలోనే విద్యుత్‌ను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టారు. కొత్త లైన్ల ఏర్పాటు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నూతన లింక్ లైన్ల నిర్మాణం వంటి ముందస్తు వేసవి చర్యలతో మండలంలో అంతరాయం లేని విద్యుత్‌ను అందిస్తూ అధికారులు సత్ఫలితాలను సాధిస్తున్నారు.

అంతరాయాలపై ఆరా..

ఎప్పుడైన 33 కేవీ లైన్లలో సమస్యలు తలెత్తుతాయో దాదాపు ఒక మండల పరిధిలోని సగభాగం లేదా మండలం అంతా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. అంతేకాక సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు లేదా ఇతర పరికరాల్లో సమస్యలు రావడం వంటివి జరుగుతుంటాయి. ఫలితంగా సబ్‌స్టేషన్‌కు అనుసంధానంగా ఉన్న 11 కేవీ లైన్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆయా గ్రామాలు అంధకారంలో మగ్గాల్సి వస్తుంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ అంతరాయాలకు గల కారణాలపై సర్వేలు నిర్వహించి సేకరించిన నివేదికల ఆధారంగా తీసుకున్న చర్యల ఫలితంగా అంతరాయం తగ్గిందని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.

విద్యుత్ వలయాల ఏర్పాటుతో..

విద్యుత్ సరఫరాలో అడ్డంకులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లలలో కావాల్సిన లింక్ లైన్లను ఏర్పాటు చేసి విద్యుత్ వలయాలు ఏర్పాటు చేశారు. దీని మూలంగా ప్రతీ సబ్‌స్టేషన్‌కు మరో లైన్ ద్వారా బ్యాక్ ఫీడింగ్ సప్లై అందేలా లైన్ల నిర్మాణం వంటి మార్పులు చేర్పులు చేసింది. దీంతో పాటు



లైన్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

చెట్ల కొమ్మల తొలగింపు, లైన్‌కు మరమ్మతులు, సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్, గ్రామాల్లో ఉన్న ఓవర్ లోడ్‌ను నివారించడంతో పాటు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది. ఈ మార్పులతో గత నెల రోజుల నుంచి విద్యుత్ అంతరాయం తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు.



పిండిప్రోలు సబ్‌స్టేషన్‌లో అదనపు లైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి(ఫైల్)

నిమిషాల్లోనే పునరుద్ధరణ..



వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరచూ ఏర్పడుతుంటాయి. వాటిని అరికట్టేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చేది. కాని ప్రస్తుతం నెట్‌వర్క్‌లో పలు మార్పులు చేయడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నూతన 33 కేవీ లింక్ లేన్ల నిర్మాణం చేపట్టడంతో నిమిషాల వ్యవధిలోనే విద్యుత్‌ను పునరుద్ధరించగల్గుతున్నాం. ఇందుకు విద్యుత్ లైన్ల వలయాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అంతరాయాలపై ఫోన్ కాల్స్ ఒత్తిడి పూర్తిగా తగ్గిపోయింది. ఏమైనా విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే 1912 నంబర్‌కు కాల్ చేయండి.

– కిలారు నాగేశ్వరరావు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, తిరుమలాయపాలెం

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

● రఘునాథపాలెం: మండల పరిధిలోని మంచుకొండ, రఘునాథపాలెం గ్రామాల్లోని విత్తనాల దుకాణాలపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి, రఘునాథపాలెం ఎస్సై నరేష్ ఆధ్వర్యాన ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్ పొందిన విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలు కొని రశీదు తీసుకోవాలని, వాటిని పంటకాలం ముగిసే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. అధిక దిగుబడి ఆశ చూపుతూ బిల్లులు లేకుండా విత్తనాలు అమ్మితే తీసుకోవద్దన్నారు. పత్తి పంటలో నిషేధిత గడ్డి మందు తట్టుకునే వంగడాల విత్తనాలను ప్రభుత్వం అనుమతించలేదని, అలాంటి విత్తనాలు విక్రయించడం నేరమని స్పష్టం చేశారు. అనుమతి లేని విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తన వ్యాపారులందరూ నాణ్యమైన విత్తనాల సరఫరా చేయాలని సూచించారు.

● నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి ఎం.రాధ తనిఖీ చేశారు. అనంతరం స్థానిక రైతువేదికలో విత్తన డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించి నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్, విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

● కూసుమంచి: కూసుమంచిలోని పలు విత్తన దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి వాణి, ఎస్సై నాగరాజు కలిసి తనిఖీ చేశారు.



ఖమ్మంరూరల్: విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

డీలర్లు విత్తన చట్టానికి లోబడి విత్తనాలను విక్రయించాలని, ఎక్కడైనా బీటీ– 3 విత్తనాలు విక్రయించినట్లయితే వ్యవసాయశాఖ అధికారులు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

● ఖమ్మంరూరల్: వ్యవసాధికారులచే ధ్రువీకరించబడిన విత్తనాలనే అమ్మాలని, నకిలీ, అనుమతి లేని విత్తనాలు అమ్మితే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ ఉమానగేష్ హెచ్చరించారు. మండలంలోని తల్లంపాడులోని విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్ బుక్స్, ప్రిన్సిపుల్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. విత్తన అమ్మకాలపై రికార్డులు రాయాలని, స్టాక్‌బోర్డు ఉండాలని, ఎంఆర్‌పీ ధరలను బోర్డుపై స్పష్టంగా కనిపించేలా ఉంచాలన్నారు. అలాగే విత్తనం ప్యాకెట్ అమ్మితే విత్తన కంపెనీ పేరు, తయారీ, ఎక్స్‌పైరీ తేదీ, ధర బిల్లులో రాయాలని పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా కేబుల్ వైర్లు ఉండొద్దు..

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా కేబుల్ వైర్లు అమర్చడంతో అనేక అనర్థాలకు దారి తీస్తుందని ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. కేఎంసీ పరిధిలో విద్యుత్ స్తంభాలకు లాగిన కేబుల్, టీవీ ఆపరేటర్లతో విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు అరర్చడంతో విద్యుత్ సిబ్బంది పోల్స్ ఎక్కే సమయాన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలుచోట్ల ఎక్కేందుకు వీలుగాకుండా ఉందని, వైర్లు రోడ్లపైకి వేలాడుతున్నాయని, కేబుల్ వైర్లు విద్యుత్ వైర్లకు తగిలినప్పుడు వీటి ద్వారా విద్యుత్ ప్రసరించి ఇళ్లలో వినియోగదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈనేపథ్యాన ఒక్కో స్తం



మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

భానికి రూ.20ల పెనాల్టీ విధిస్తున్నామని, ఇకనుంచి వైర్లను సక్రమంగా క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం టౌన్ విద్యుత్ డి.నంబూరి రామారావు, కేబుల్ ఆపరేటర్ల ప్రతినిధులు, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



సందేశం అందిస్తున్న బిషప్ సగిలి ప్రకాష్

కూసుమంచి: లోక రక్షకుడు ఏసుక్రీస్తు బోధనలను సమాజంలో ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ అన్నారు. పాలేరులోని అద్భుతాల మేరీమాత పుణ్యక్షేత్రంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 25 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా దివ్య బలిపూజ నిర్వహించగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వరంగల్, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి మత గురువులు, మత కన్యలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ.. కరుణామయుడు అందించిన శాంతి, సమాధానం, కరుణ, ఆప్యాయతలు ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల చూపించాలన్నారు. పాలేరు మేరీమాత పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొమ్ము ఆంటోనీ మాట్లాడుతూ.. పాలేరులోని 76 అడుగుల మేరీమాత స్వరూపం ఆసియా ఖండంలోనే ప్రసిద్ధిగా నిలిచి విశ్వాసుల కోరికలను తీరుస్తూ అద్భుతాలు అందిస్తుందన్నారు. ఆధ్యాత్మిక గీతాల బృంద ఇన్‌చార్జ్ కొమ్ము ప్రసాద్, ఫాదర్ జయరాజ్ ఆధ్వర్యాన నిర్వహించిన గీతాలాపనలు అలరించాయి.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం గ్రామంలో శుక్రవారం నాభిశిల బొడ్రాయి పునఃప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా జలబిందెల కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. బలిహరణ కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొనగా.. బొడ్రాయి ఊరేగింపును ఆటా, పాటలతో వేద మంత్రోచ్ఛరణ నిర్వహించారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తీగ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ పతానాపు నాగయ్య, గ్రామ పెద్దలు బోయిన వేణు, తీగ రమణయ్య, వెన్నబోయిన శ్రీను, డేగల రోశయ్య, బోయిన బలరాం, నరేష్, చంద్రయ్య, వెంకట్రామయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద జలాభిషేకం చేస్తున్న అర్చకులు

నేడు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



జలాభిషేకంలో పాల్గొన్న గ్రామస్తులు

కామేపల్లి: మండలంలోని మద్రిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి, ముత్యాలమ్మ తల్లి దేవాలయాల్లో నేడు(శనివారం) విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రతిష్ఠ చేయనున్న విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి మేళతాళాలతో నృత్యాలు చేస్తూ ట్రాక్టర్‌పై ఊరేగించారు. సాయంత్రం మహిళలు కుంకుమ పూజలో పాల్గొనగా.. వేద పండితులు ఉప్పల సాగర్‌శర్మ ఆధ్వర్యాన వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. దేవాలయ నిర్మాణ దాత దిరిశాల నరేష్‌చౌదరి, స్వాతి దంపతులు, తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోశాలలో ప్రత్యేక పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాలలో ఖమ్మం అర్బన్(ఖానాపురం హవేలి) సీఐ భానుప్రకాష్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా గోపూజ నిర్వహించి గోవులకు గ్రాసం అందించారు. ఆలయ అర్చకులు, గోశాల బాధ్యులు కేశా హనుమంతురావు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలపై చర్యలు తీసుకోండి

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంక్రైం: ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై హైదరాబాద్‌కు చెందిన చిలుక ప్రవీణ్ అసత్య ప్రచారం చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఖమ్మం తుమ్మలగడ్డకు చెందిన పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యాన ఖమ్మం వన్‌టౌన్ సీఐ కరుణాకర్‌కు వినతి పత్రం అందజేశారు. యూట్యూబ్ చానల్‌లో మత విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, ముస్లిం సమాజాన్ని తలదించుకునేలా ఉన్నాయన్నారు. ముస్లింపెద్దలు షేక్.అఫ్జల్, డాక్టర్ ఖిజారుల్లా, షేక్.రెహమాన్, టిప్పు సుల్తాన్, వసీం, జావీద్, యాఖుబ్, షేక్.ఖబీర్ పాల్గొన్నారు.



సీఐకు వినతి పత్రం అందిస్తున్న ముస్లింలు

మురుగుకు మోక్షం..



మురుగు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి శ్రీశ్రీసర్కిల్ బైపాస్‌రోడ్డు ఎస్సీ విద్యార్థుల వసతి గృహం పక్కన ఉన్న తారు రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండగా.. ఈ నెల 27న 'సాక్షి'లో 'బైపాస్‌ను ముంచేస్తున్న మురుగు' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈనేపథ్యాన అధికారులు స్పందించి శుక్రవారం మురుగు నిల్వలతో పాటు పిచ్చిగడ్డిని సైతం తొలగింపజేశారు. డ్రెయిన్ నిర్మాణం కంటే ముందే కచ్చా డ్రెయిన్ తీసి అక్కడక్కడ అడ్డుగా ఉన్న మార్బుల్ దుకాణాల వద్ద పైపులు వేసుకుని నీరు ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నారు.

చెక్కుల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల, చెరువుకొమ్ముతండాలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, ఆత్మక మిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో వేపగుంట గ్రామంలో బానోతు బద్రికి సీఎంఆర్ఎఫ్, చెరువుకొమ్ముతండాలో బాదావత్ శిరీషకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కాగా వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీపక్‌నాయక్, రెంటాల ప్రసాద్, నాయకులు నాగేశ్వరరావు, రామారావు, ప్రేమ్‌కుమార్, రాము, శ్రీనివాసరావు, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సిఫారసుతో..



ఎల్ఓసీ పత్రం అందిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని గాంధీనగర్‌కు చెందిన కొలకాని పరిమళ వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.75 వేలకు ఎల్ఓసీ పత్రం మంజూరైంది. ఇటీవల బాధితురాలు మోకాలి శస్త్ర చికిత్స కోసం ఎంపీని ఆర్థిక సాయం కోరగా ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఎల్ఓసీ పత్రాన్ని హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

జూన్ 3 నుంచి భూభారతి గ్రామసభలు

ఖమ్మంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో భూభారతి గ్రామసభలు జూన్ 3 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం విలేకరులకు వివరించారు. గ్రామసభల్లో మిస్సింగ్ సర్వే నంబర్, పెండింగ్ మ్యూటేషన్, సర్వే నంబర్, భూమి రికార్డుల్లో తుప్పులు సవరించడం, అర్హత పత్రాలు ఉండి రికార్డులలో నమోదు కాకపోవడం వంటి సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను తీసుకోనున్నట్లు తెలిపారు. అధికారులు రెండు టీంలుగా గ్రామాలకు వచ్చి సభలు నిర్వహిస్తారన్నారు. జూన్ 3న బారుగూడెం, పల్లెగూడెం, 4న గుర్రాలపాడు, గూడురుపాడు, 5న ఆరెంపుల, తనగంపాడు, 6న ఆరేకోడు, ఆరేకోడుతండా, కస్నాతండా, 9న చింతపల్లి, గొల్లగూడెం, కాచిరాజుగూడెం, 10న ముత్తగూడెం, గోళ్లపాడు, 11న కొండాపురం, పోలేపల్లి, 12న తల్లంపాడు, దారేడు, 13న పొన్నేకల్, పడమటితండా, 14న గుదిమళ్ల, కామంచికల్, 16న వెంకటగిరి, ఎం వెంకటాయపాలెం, 17న తెల్దారుపల్లి, తీర్థాల, 18న మద్దులపల్లి, పోలిశెట్టిగూడెం, 19న ఏదులాపురం, మంగళగూడెం, 20న పెదతండాలో గ్రామసభలు జరుగుతాయని, వీటిని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

రోడ్డు వెడల్పునకు మార్కింగ్



మార్కింగ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు రోడ్లను విస్తరించేందుకు కేఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానికుల సమన్వయంతో ఇరుకు రహదారులను విస్తరిస్తుండగా.. ఇప్పటికే రిక్కాబజార్, రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే శుక్రవారం చెరువుబజార్ రోడ్డును 60 అడుగులు వెడల్పు చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ చేశారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డులో వాహనాల రద్దీ పెరగడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ వసుంధర నేతృత్వాన అధికారులు రోడ్డు మధ్య నుంచి కొలతలు వేసి మార్కింగ్ చేశారు. రోడ్ల విస్తరణతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందని ఏసీపీ పేర్కొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



పురస్కారం అందుకుంటున్న మనస్విని

తిరుమలాయపాలెం: హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇటీవల నిర్వహించిన భారతీయ సంస్కృతి సకల కళా పురస్కారాల పోటీల్లో మండలంలోని బీరోలుకు చెందిన బత్తిని మనోజ్‌కుమార్ సంధ్యారాణిల కుమార్తె మనస్విని ప్రతిభ కనబర్చింది. ఈమె దమ్మాయిగూడెం శ్రీ సరస్వతి విద్యాలయంలో అభ్యసిస్తూ.. శుక్రవారం పోటీల్లో పాల్గొని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ తేజావత్ రాందాస్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. ఈ కార్యక్రమంలో సినిమా కొరియోగ్రాఫర్ అనంద్ జాక్సన్, బీ9 స్టూడియో ప్రతినిధులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా..





మండలంలోని హరియతండా గ్రామపంచాయతీ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలే లక్ష్యంగా కొందరు దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. గ్రామ శివారులోని పలు ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన విద్యుత్ సామగ్రిని రాత్రి వేళల్లో దొంగిలిస్తున్నారు. దీంతో రైతులు విద్యుత్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఘటనలపై స్థానికులు ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఇకనైనా విద్యుత్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, రైతుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– రఘునాథపాలెం